క్లుప్తంగా

నేడు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో రెండో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం లేదని ఆ శాఖ అధికారులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. వరుస పండుగల నేపథ్యంలో వాయిదా వేసినట్లు చెప్పారు. తదుపరి తేదీని త్వరలో ప్రకటిస్తామన్నారు.

శని త్రయోదశికి ఏర్పాట్లు

నాగలాపురం : మండల కేంద్రంలోని సురుటుపల్లిలోని పల్లికొండేశ్వర స్వామి ఆలయంలో శనివారం శని త్రయోదశి ప్రదోష పూజలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి లత పేర్కొన్నారు. స్వామి అమ్మవార్లను దర్శించుకొనేందుకు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున క్యూలైన్లు, తాగునీటి సౌకర్యం కల్పించి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేసినట్లు ఈఓ తెలిపారు.

అమిత్ షా రాజీనామా చేయాలి



నిరసనలో కాంగ్రెస్ పార్టీ నాయకులు

శ్రీకాళహస్తి : భారత రాజ్యాంగాన్ని కేంద్ర ప్రభుత్వం అబాసుపాలు చేస్తోందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తలపా దామోదర్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద జై బాపూజీ, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. తిరుపతి జిల్లా అధ్యక్షుడు బాలగురవం బాబు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ.. పార్లమెంటు సమావేశాల్లో అంబేడ్కర్‌పై అవమానకరంగా మాట్లాడిన అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో దాసరి రత్నం, గురుమూర్తి, శబరిరెడ్డి, కళిందర్, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.


దోమల నిర్మూలనకు చర్యలు



మురుగు కాలువ శుభ్రం చేస్తున్న పంచాయతీ సిబ్బంది, అధికారులు

సత్యవేడు : మండలంలోని పుదుకుప్పంలో దోమల నిర్మూలనకు చర్యలు చేపట్టారు. సబ్ యూనిట్ అధికారి మోహన్ పర్యవేక్షణలో వైద్య సిబ్బంది, సర్పంచ్ నాగమణి, సెక్రటరీ మాధవి ఆధ్వర్యంలో శుక్రవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. రోడ్డుకు ఇరువైపులా మురుగు కాలువలు శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లి మలాథిన్ పిచికారీ చేయించారు. ఇంటింటా జ్వర పీడితుల వివరాలను వైద్య సిబ్బంది సేకరించారు. సీజనల్ వ్యాధులు, డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ గుణశేఖర్, ఎంపీహెచ్ ఈఓ సుబ్రమణ్యం, ఈఓపీఆర్డీ తరుణాక్షరెడ్డి, ఎంఎల్ పీహెచ్ మహాలక్ష్మి పాల్గొన్నారు.

గిరిజనుల మధ్య కుదరని సయోధ్య !



మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్య శంకర్ నాయక్

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): వారం రోజులుగా గిరిజనుల మధ్య జరుగుతున్న వివాదాన్ని తెలుసుకొని కాలనీకి వచ్చిన ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్య శంకర్‌నాయక్ ఇరువర్గాలతో మాట్లాడి సయోధ్య కుదిర్చే ప్రయత్నం చేసినా ఫలించలేదు. వివరాల్లోకి వెళితే.. రేణిగుంట మండలం, వెదుళ్లచెరువు ఎస్టీ కాలనీలో మూడేళ్ల కిందట నెల్లూరు నుంచి అశోక్ అనే గిరిజనుడు వచ్చి స్థిరపడ్డాడు. అతని కుటుంబ సభ్యులు ఓ మందిరాన్ని నిర్మించుకొని ప్రార్థనలు చేసుకుంటున్నారు. ఆ కాలనీలో 15 కుటుంబాలు ఆయన వెంట నడుస్తున్నాయి. ఈక్రమంలో మైక్ పెట్టడంతో మరో వర్గానికి ఇబ్బందులు తలెత్తడంతో వివాదం నెలకొంది. దీనిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్టీ కమిషన్ సభ్యులు ఎంత చెప్పినా మరో వర్గం వారు వినకపోవడంతో కమిషన్ సభ్యులు వెనుతిరిగి వెళ్లిపోయారు. వివాదం ముదరకముందే ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని ఎస్టీ కాలనీపై దృష్టి పెట్టి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గుంతలు పూడ్చివేత

సత్యవేడు : బాలుర గురుకుల క్రీడామైదానంలోని గుంతలు పూడ్చివేతకు ప్రిన్సిపల్ సత్యనారాయణ చర్యలు చేపట్టారు. పాఠశాల ప్రాంగణంలో వర్షాలకు ఖోఖో , కబడ్డీ, వాలీబాల్ ఆట స్థలంలో గుంతల్లో నీరు చేరి ఆటలు ఆడేందుకు ఇబ్బందిగా ఉండేది. సమీపంలోని తెలుగు గంగ కాలువ మట్టి తోలి గుంతలు పూడ్చేందుకు చర్యలు చేపట్టారు. గుంతలు లేకుండా క్రీడా మైదానాన్ని పీడీ నాగరాజు పర్యవేక్షణలో ఆధునీకరించారు.

మనోన్మణి ఉత్సవం



శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం వైభవంగా మనోన్మణి (గొబ్బెమ్మ) ఉత్సవం జరిగింది. శుక్రవారం ఆలయ అలంకార మండపంలో అమ్మవారికి పలు రకాల అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం ధూప, దీప నైవేద్యాలు సమర్పించి పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. – శ్రీకాళహస్తి

ఆ మలుపు ప్రమాదాలకు పిలుపు

బుచ్చినాయుడుకండ్రిగలోని తానిగిల్లు వద్ద రోడ్డు మలుపు ప్రమాదాలకు నిలయంగా మారింది. మలుపు ప్రమాదకరంగా ఉండడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనపడక ఆస్పత్రుల పాలవుతున్నారు. మలుపునకు ఇరువైపులా వేగ నిరోధకాలను ఏర్పాటు చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులను కోరినా పట్టించుకోలేదని వాహనదారులు వాపోతున్నారు. – బుచ్చినాయుడుకండ్రిగ



జోరుగా వేరుశనగ సాగు



వరదయ్యపాళెం మండలంలో వేరుశనగ పంట సాగు వారం రోజులుగా జోరుగా సాగుతోంది. వర్షాలు తగ్గడంతో పంట సాగుకు అదునుగా భావించిన రైతులు విత్తన సాగు చేపడుతున్నారు. కురింజల్లం, పెద్దపాండూరు, చెన్నవారిపాళెం, వెంగారెడ్డికండ్రిగ, సుబ్బానాయుడుకండ్రిగ, బలిజపాళెం, రాచర్ల ప్రాంతాల్లో ఇప్పటి వరకు 150 ఎకరాల్లో వేరుశనగ సాగు చేసినట్లు ఏఓ గౌరి తెలిపారు. – వరదయ్యపాళెం

పండుగొచ్చింది.. రోడ్లెక్కడ?

కూటమి ప్రభుత్వం 'పల్లె పండుగ' పేరుతో గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టిన సిమెంటు రోడ్ల నిర్మాణ పనులు నత్తతో పోటీ పడుతున్నాయి. పండుగొచ్చినా పాత రోడ్లతో అవస్థలు తప్పదేమోనని ప్రజలు నిట్టూరుస్తున్నారు. సంక్రాంతికి పల్లె రోడ్లు కళకళలాడేలా చేసి కొత్త అల్లుళ్లను కొత్త సిమెంట్ రోడ్లపై తిప్పుతామని ప్రగల్భాలు పలికిన నేతలు ఆచరణలో హామీలను తుంగలో తొక్కారు. సత్యవేడు నియోజకవర్గంలో సంక్రాంతికి సగం సీసీ రోడ్లు కూడా పూర్తికాకపోవడం, మరికొన్ని పనులు ఇప్పటికీ ప్రారంభించకపోవడం గమనార్హం.



కన్నావరంలో అధ్వానంగా అనాథ ఆశ్రమం వీధి రోడ్డు

- నత్తనడకన 'పల్లెపండుగ' రోడ్లు
- నగమైనా పూర్తి కానీ సీసీ రహదారులు
- ఆర్భాటమే కానీ ఆచరణలో విఫలం

సత్యవేడు: నియోజకవర్గంలో 305 పల్లె పండుగ సిమెంట్ రోడ్ల పనులకు రూ.1863.90 కోట్లతో 32,389.43 మీటర్ల రోడ్లు ఏర్పాటు చేసి గ్రామాల్లో మౌలిక వసతులు పెంచాల్సి ఉంది. సత్యవేడు పరిధిలో 164 పంచాయతీలు, హ్యాబిటేషన్ గ్రామాలు 593 వరకు ఉన్నాయి. క్షేత్ర స్థాయిలో మాత్రం పనులు నత్తనడకన సాగుతున్నాయి. మంజూరైన పనుల్లో సగం పనులు కూడా పూర్తి కాకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

అధ్వానంగా అంతర్గత రహదారులు

గ్రామీణ ప్రాంతాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు పంచాయతీల్లో అంతర్గత దారులు అధ్వానంగా మారాయి. రోడ్లపై మట్టి కొట్టుకుపోయి గులకరాళ్లు తేలి ప్రమాదకరంగా ఉన్నాయి. అధికంగా రోడ్లు దెబ్బతినడంతో గ్రామీణ ప్రజలు ప్రయాణాలకు నరకయాతన పడుతున్నారు. గ్రామ పంచాయతీలకు ఆర్థిక వనరులు స్వల్పంగా ఉండడంతో పారిశుద్ధ్యం, విద్యుత్, నీటి సరఫరా వినియోగానికే నిధులు సరిపోతుండడంతో రోడ్ల ఏర్పాటు కష్టంగా ఉంటోంది. ప్రభుత్వం పల్లె పండుగ పేరుతో గ్రామాల్లో అంతర్గత రహదారుల నిర్మాణాలు చేపట్టి పండుగకు పల్లెలన్నీ కొత్త రోడ్లతో కళకళలాడేలా చర్యలు తీసుకొంటామని చెప్పారు. కానీ క్షేత్ర స్థాయిలో రోడ్ల పనులు నత్తతో పోటీ పడుతుండడంతో మంజూరైన పనుల్లో 50 శాతం కూడా అధిగమించకపోవడంతో అవస్థలు తప్పదేమోనని గ్రామీణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండలాల వారిగా పనులు వివరాలు

మండలం పేరు	మంజూరైన పనులు	కే.ని (రూ.లక్షల్లో)	మీటర్లు
బీఎన్ కండ్రిగ	49	240	4800
కేవీబీపురం	46	266	4420
నాగలాపురం	41	142	2850
నారాయణవనం	25	624	9669
పిచ్చాటూరు	35	181	2720
సత్యవేడు	77	239	4670
వరదయ్యపాళెం	32	170	3260
	305	1863	32389

- కే.ని: కేటాయించిన నిధులు

మూడు రోడ్డు పనులు రద్దు

సత్యవేడు మండలంలో మూడు సిమెంటు రోడ్లు రద్దు చేశారు. పెద్ద ఈటిపాకం పంచాయతీలోని సత్రం, మదనంజేరిలలో పట్టా భూమిలో సిమెంటు రోడ్డు ఏర్పాటు ప్రతిపాదించడంతో రద్దు చేశారు. అలాగే అల్లపుగుంటలో అటవీశాఖకు సంబంధించిన భూమిలో రహదారి ఏర్పాటుకు ప్రతిపాదించారు. ఈ నేపథ్యంలో ఫారెస్టు అధికారులు అడ్డు చెప్పడంతో రోడ్డు పనిని రద్దు చేశారు.

15 ఏళ్లుగా మట్టి రోడ్డు



కన్నావరంలోని టవర్ రోడ్డు 15 ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. గత వర్షాలకు రోడ్డుపై మట్టి కొట్టుకుపోవడంతో గులకరాళ్లు లేచి పిల్లలు నడవలేక పడిపోతున్నారు. కాళ్లకు గాయాలవుతుండడంతో పిల్లలను ఆస్పత్రికి తీసుకుపోవాల్సి వస్తోంది. సిమెంటు రోడ్డు వసతి కల్పించాలి.

– నిత్య, కన్నావరం, సత్యవేడు మండలం

కాలువలు ఏర్పాటు చేయాలి



అనాథ ఆశ్రమం వరకు ఉన్న రోడ్డు 15 ఏళ్లుగా మట్టి రోడ్డు ఉంది. స్థానిక ప్రజలకు రోడ్డు వసతి, మురుగు కాలువలు ఏర్పాటు చేయలేదు. పంచాయతీ అధికారులు స్పందించి అనాథ ఆశ్రమానికి వెళ్లే టవర్ రోడ్డు ఆధునీకరిస్తే స్థానికులకు ఇబ్బందులు తొలగిపోతాయి.

– వినిత, కన్నావరం, సత్యవేడు మండలం



నిధులు మంజూరైనా ప్రారంభించని టవర్ రోడ్డు పనులు

ప్రభుత్వ భూముల ఆక్రమణలపై నిలదీత



సమావేశంలో తహసీల్దార్‌ను ప్రశ్నిస్తున్న సర్పంచులు

వరదయ్యపాళెం : మండలంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూముల స్వాధీనంలో నిర్లక్ష్యమెందుకని పులివల్లం సర్పంచ్ బాలకృష్ణ, అంబూరు సర్పంచ్ సాయిరెడ్డి అధికారులను నిలదీశారు. శుక్రవారం వరదయ్యపాళెంలో ఎంపీపీ పద్మప్రియ అధ్యక్షతన మండల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పులివల్లంలో శ్మశానం ఆక్రమణకు గురైందని ఫిర్యాదు చేసినా స్పందన లేదన్నారు. దీనిపై అధికారులను నిలదీసినందుకు ఏకంగా తనపై స్థానిక వీఆర్వో, సర్వేయర్ ద్వారా ఫిర్యాదులు చేసి అక్రమంగా కేసులు బనాయించి దళిత ప్రజాప్రతినిధిగా తనను అవమానానికి గురిచేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే అంబూరు ప్రాంతంలో ఆక్రమణకు గురైన మేతబీడు భూములు స్వాధీనం చేసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానిక సర్పంచ్ ఆవేదన చెందారు. అలాగే ఇందిరానగర్, కాంబాకం గ్రామాల్లో విద్యుత్ సమస్యల గురించి ఏఈ విజయ్ వెంకటేష్‌ను ప్రశ్నించారు. పల్లె పండుగలో ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మిస్తున్న సిమెంటు రోడ్లను సర్పంచులకు సంబంధం లేకుండా వేయడం ఏమిటని పలువురు సర్పంచులు సభలో అధికారులను ప్రశ్నించారు. ప్రభుత్వ నిర్ణయం మేరకు పనులు చేపడుతున్నట్లు ఎంపీడీఓ జవాబిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ ప్రసాద్, ఈఓపీఆర్డీ చిరంజీవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంపీపీ

భూసమస్యలపై విచారణ



భూసమస్యలపై విచారణ చేస్తున్న తహసీల్దార్ రాజశేఖర్

వరదయ్యపాళెం : సుదీర్ఘ కాలంగా అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలపై తహసీల్దార్ రాజశేఖర్ శుక్రవారం విచారణ చేపట్టారు. ఆ మేరకు కురింజల్లంలో సర్వే నెంబరు 36/11లో 3.50 ఎకరాలకు సంబంధించి ఇరువర్గాలతో చర్చించారు. అలాగే అరుదూరు, మరదవాడ గ్రామాల్లో నెలకొన్న సమస్యల గురించి పీజీఆర్ఎస్‌లో అందిన ఫిర్యాదులపై అర్జీదారులతో ఆయన మాట్లాడారు. రికార్డులు పరిశీలించి సమస్యలు పరిష్కరిస్తానని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శుక్రవారం పలువురు ప్రముఖులు వేర్వేరు సమయాల్లో దర్శించుకున్నారు. వారిలో నందమూరి రామకృష్ణ, నవయుగ సంస్థ అధినేత కొండా విశ్వేశ్వరరావు, తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ చిరంజీవి, పాలకొండ ఎమ్మెల్యే నిమ్మన జయకృష్ణ, తాడికొండ ఎమ్మెల్యే శ్రావణ్, వైజాగ్ ఎమ్మెల్యే వంశీకృష్ణయాదవ్, యర్రగొండపాళెం ఎమ్మెల్యే చంద్రశేఖర్ ఉన్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు వారికి సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

సంబరాలు జయప్రదం చేద్దాం

శ్రీకాళహస్తి : సంక్రాంతి సంబరాలను జయప్రదం చేయాలని హిందూ ధర్మ ప్రచార పరిషత్ సభ్యులు కోరారు. పట్టణంలోని నెహ్రూ వీధిలోని రాములవారి ఆలయంలో శుక్రవారం సంక్రాంతి సంబరాల గోడపత్రికను ఆవిష్కరించారు. పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో సంబరాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో హిందూ ధర్మ ప్రచార పరిషత్ సభ్యులు జయరామయ్య, సురేంద్రబాబు, చందు, నేతాజీ పాల్గొన్నారు.

పాకెట్ క్యాలెండర్ల ఆవిష్కరణ



పాకెట్ క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న బృందమ్మ

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్) : శ్రీకాళహస్తి మండలంలోని తొండమాన్‌పురంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం పాకెట్ క్యాలెండర్లను మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి సతీమణి బొజ్జల బృందమ్మ ఆవిష్కరించారు. కందాటి విశ్వేశ్వర్ రెడ్డి కొన్నేళ్లుగా ఏకాదశి సందర్భంగా క్యాలెండర్‌లు పంచి పెట్టడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు చెంచయ్య నాయుడు, విష్ణుకుమార్ , లక్ష్మీకాంతమ్మ , ఆలయ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ రెడ్డి, ఆలయ అర్చకులు సంపత్ స్వామి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

వీధి దీపాలకు మరమ్మతులు

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని పల్లమాలలోని వీధి దీపాలకు బుధవారం సర్పంచ్ జొన్నల రమణమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జొన్నల గోపాల్‌రెడ్డి శుక్రవారం గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగునకు చర్యలు చేపట్టారు. దళితవాడలోని డ్రైనేజీ కాలువల్లో మురుగును కూలీలతో తొలగించారు. అదే విధంగా వీధుల్లో నిల్వ ఉన్న చెత్తా చెదారాన్ని తొలగించి, బ్లీచింగ్ చల్లించారు. ఓవర్‌హెడ్ ట్యాంకులో క్లోరినేషన్ చేయించారు. మురుగు నీరు నిల్వ లేకుండా చేయడంపై గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

వైభవంగా వైకుంఠ ఏకాదశి



నారాయణవనం : ఊరేగింపులో కల్యాణ వేంకటేశ్వరస్వామి





వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు, ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

నారాయణవనం : వైకుంఠ ఏకాదశి ఉత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వేకువ జామున 4.30 గంటల నుంచి భక్తులను అనుమతించారు. శ్రీదేవీ, భూదేవీ సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామిని తిరుచ్చి వాహనంపై అధిష్టింపజేసి ఉత్సవర్ల ఊరేగింపు చేశారు. ఆలయ సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ అధికారులు నాగరాజు, భరత్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేడు ద్వాదశి ద్వారోత్సవం

కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం వైకుంఠ ద్వాదశి ద్వారోత్సవంలో భక్తుల ఉత్తర ద్వార ప్రవేశానికి టీటీడీ ఏర్పాట్లు చేసింది. నారాయణవనం, తమిళనాడులో శ్రీరంగం ఆలయాల్లో మాత్రమే ద్వాదశి రోజున ఉత్తర ద్వారాన్ని తెరిచి ఉదయం 8.45 గంటల నుంచి భక్తులను అనుమతిస్తారని నిర్వాహకులు తెలిపారు. 7.30 గంటలకు మాడ వీధి ఊరేగింపు అనంతరం ఉభయ దేవరులతో కల్యాణ వెంకన్న ఆలయ అంతర ప్రాకార ఉత్తర ముఖ ద్వారంలో ప్రవేశిస్తారని ఆలయ అధికారి నాగరాజు, ప్రధాన అర్చకులు శ్రీధరభట్టాచార్య పేర్కొన్నారు.

శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం..

బుచ్చినాయుడుకండ్రిగ : శ్రీ పసన్న వేంకటేశ్వరస్వామికి ఘనంగా పూజలు చేశారు. ఉత్సవ మూర్తులను గ్రామంలో ఊరేగించారు.

అభయహస్త వేంకటేశ్వర స్వామికి..

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయంలోని అభయ హస్త వేంకటేశ్వరస్వామికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. పలు రకాల పుష్పాలతో స్వామిని అలంకరించారు. భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట) : రేణిగుంటలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయం, గురవరాజుపల్లిలోని శ్రీ మహాదేవ ఆశ్రమం, గాజులమండ్యంలోని వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో వైకుంఠ ద్వారం ఏర్పాటు చేసి భక్తులకు దర్శన భాగ్యం కలిగించారు. రైల్వేస్టేషన్ వద్దగల సిద్ధి వినాయక టాక్సీ డ్రైవర్స్, ఓనర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రైల్వే అధికారి సందీప్ కుమార్, యూనియన్ అధ్యక్షుడు ప్రకాష్, షంషీర్, మొహమ్మద్, పార్థసారథి, విలియమ్స్, నందమూరి రాజా పాల్గొన్నారు.

శ్రీసిటీ ఆలయంలో..

శ్రీసిటీ(సత్యవేడు) : వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామిని దర్శించుకొన్నారు. శ్రీ సిటీ శ్రీవాణి ఆధ్యాత్మిక సాహిత్య వేదిక ఆధ్వర్యంలో ప్రముఖ హరికథా సురంధర డా.వైజ వెంకటేశ్వర్లు భాగవతార్ నేతృత్వంలో అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులతో నిర్వహించిన సుందర కాండ హరికథా గానం అలరించింది. కళాకారుల బృందాన్ని శ్రీ సిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్.రవీంద్ర సన్నారెడ్డి సత్కరించారు.

వరదయ్యపాళెం : కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు వైభవంగా జరిగాయి. ఆలయ దర్శనానికి హాజరైన భక్తులకు తిరుమల లడ్డు ప్రసాదాలను స్థానిక వ్యాపారి పవన్‌కుమార్ ఆధ్వర్యంలో భక్తులకు అందజేశారు. ఆలయ అర్చకులు మోహనాచార్యులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

రేణిగుంట(ఏర్పేడు) : మండలంలోని వికృతమాలలో వెలసిన శ్రీసంతాన సంపద వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆలయ చైర్మన్ హరిప్రసాద్ ఆధ్వర్యంలో పుష్పాలంకరణ చేశారు. అన్నమయ్య, త్యాగరాజ కీర్తనలను ఆలపించి భక్తులను అలరించారు.







రేణిగుంట : ఆదిశేష వాహనంపై మలయప్ప స్వామి, స్వామివారిని దర్శించుకొంటున్న భక్తులు, కళాకారులను సన్మానిస్తున్న శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి